సాక్షి ఒడిశా

శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 2,90,795
బంగారం : 12 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
వెండి : 68 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



టికిరిని సమితిగా గుర్తించాలి

రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీని సమితిగా గుర్తించాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఆ ప్రాంత ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.

- 8లో.

ప్రధాని సభలో డ్రోన్లు నిషేధం

భువనేశ్వర్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ఝార్సుగుడకు రానున్నారు. అమ్లిపాలి మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తారు. ప్రధాన మంత్రి సమావేశ స్థలంలో, చుట్టు పక్కల డ్రోన్ల విని యోగం పూర్తిగా నిషేధించారు. జిల్లా యంత్రాంగం ఈ విషయంలో కట్టుదిట్టంగా వ్యవహరిస్తోందని ప్రభుత్వ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

న్యూస్‌రీల్

నువాపడా ఉప ఎన్నికకు సన్నాహాలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

భువనేశ్వర్: నువాపడా శాసనసభ నియోజకవర్గానికి త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ఆర్.ఎస్.గోపాలన్ నువాపడా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఉప ఎన్నిక సజావుగా నిర్వహించడానికి అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని సీఈఓ ఆదేశించారు.

రాయగడలో భారీ వర్షం



సరళా కూడలి వద్ద నిలిచిపోయిన వర్షం నీరు

రాయగడ: రాయగడ పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. స్థానిక మెయిన్‌రోడ్డు, సరళా కూడలిప్రాంతాల్లోని రోడ్లు చెరువులను తలపించాయి. సుమారు గంట సేపు కుండ తోత వర్షం కురవడంతో జనజీవనం కొద్దిసేపు స్తంభించింది.

బైకు చోరీ కేసులో నిందితునికి జైలు

రాయగడ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బైకు చోరీ కేసుకు సంబంధించి అరెస్టు అయిన నిందితుడుకి ఐదు నెలల జైలు శిక్షను విధిస్తూ స్థానిక ఎస్‌డీజేఎం వర్షా దాస్ శుక్రవారం తీర్పునిచ్చారు. గత జూన్ 2వ తేదీన కెబిడి గ్రామానికి చెందిన గంగాధర నచిక అనే వ్యక్తి తన చెల్లికి ఆర్యోగ్యం బాగేలేకపోతే చికిత్స కోసం బైక్‌పై రాయగడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. బైక్‌ను పార్కింగ్ స్థలంలో ఉంచి చికిత్స అనంతరం వచ్చేసరికి కనిపించకపోవడంతో సదరు పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు సైమన్ కుమార్ రవుత్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసును పరిశీలించిన ఎస్‌డీజేఎం.. 9 మంది సాక్షులను విచారించిన అనంతరం తుది తీర్పును వెల్లడించారు.

అత్యాచారం కేసులో.. నిందితుడికి పదేళ్లు జైలు

- రూ. 30 వేలు జరిమానా

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గుసాని సమితి గారబంద పోలీస్ స్టేషన్‌లో (2022) రేప్ కేసులో మండళబాబు నిందితుడిగా కేసు నమోదైంది. ఈ కేసులో అప్పటి తాత్కాలిక ఇన్‌స్పెక్టర్ సర్వేశ్వర్ సామంతరాయ్ దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. కేసు రెండేళ్లకు పైగా కోర్టులో నడిచింది. శుక్రవారం 21 మంది సాక్షులను విచారించారు. పలు సెక్షన్ల కింద పదేళ్లు జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ సి.జె.ఎం, అసిస్టెంట్ షెషన్స్ జడ్జి నరోత్తమ శెఠి తీర్పు చెప్పారు. ఈ కేసును ప్రభుత్వం తరఫు న్యాయవాది పంటల ప్రసాద రావు వాదించినట్టు పర్యవేక్షక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ కుమార్ మిశ్రా తెలిపారు.

అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్.. నేటి నుంచే సేవలు

- బరంపురం–ఉధ్నా స్టేషన్ల మధ్య రాకపోకలు
- వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ



బరంపురం రైల్వే స్టేషనులో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

రైలు ప్రారంభం వేళలు

0921	ఉధ్నా అమృత్ భారత్	స్టేషను	09022	బరంపురం అమృత్ భారత్
రాక	పోక	రాక	పోక	
--	10.50	ఉధ్నా	21.00	--
16.40	16.45	భుషావల్	13.30	13.32
23.20	23.25	నాగ్‌పూర్	07.00	07.15
03.33	03.38	దుర్గ్	03.15	03.20
04.15	04.25	రాయ్‌పూర్	02.20	02.30
05.28	05.30	మహాసముంద్	00.20	00.30
06.10	06.12	ఖరియార్ రోడ్	23.10	23.20
07.00	07.05	కంటాబంజి	21.55	22.05
07.40	07.50	టిట్లాగడ్	21.00	21.10
08.10	08.12	కెసింగా	20.30	20.40
09.23	09.25	మునిగుడ	19.05	19.15
11.10	11.15	రాయగడ	18.05	18.15
11.53	11.55	పార్వతీపురం	17.15	17.25
12.18	12.20	బొబ్బిలి	16.45	16.55
13.20	13.45	విజయనగరం	15.40	16.00
14.48	14.50	శ్రీకాకుళం రోడ్	14.35	14.45
16.25	16.27	పలాస	13.30	13.40
17.35	--	బరంపురం	--	12.00

భువనేశ్వర్: బరంపురం–సూరత్ (ఉధ్నా) మధ్య 09022 నంబరు గల అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం వర్చువల్ పద్ధతిలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బలుగాంవ్ స్టేషన్ వరకు ట్రయల్ రన్ నిర్వహించి రైలు తాజా స్థితిగతుల్ని సమీక్షించారు. అనంతరం బరంపురం రైల్వే స్టేషనులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. వర్చువల్ విధానం ద్వారా ఝార్సుగుడ నుంచి పచ్చ జెండా ఊపి ఈ రైలు సేవల్ని లాంఛనంగా ప్రారంభిస్తారు.

- 09022 అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభోత్సవం పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం 12 గంటలకు బరంపురం రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు సూరత్ (ఉధ్నా) గమ్యం చేరుకుంటుంది. ఈ రైలు విజయనగరం, రాయగడ, టిట్లాగఢ్, రాయపూర్, నాగ్‌పూర్, భుసావల్ మీదుగా ఉభయ దిశల్లో రాకపోకలు చేస్తుంది.



బరంపురం - సూరత్ (ఉధ్నా) అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో అధునాతన సౌకర్యాలు

- పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, సింగపూర్ రోడ్, మునిగుడ, కెసింగ, టిట్లాగడ్, కంటాబంజి, ఖరియార్ రోడ్, మహాసముంద్ తదితర రైల్వే స్టేషన్లలో ఆగుతూ గమ్యం చేరుతుంది.

రిజర్వేషన్లు ప్రారంభం..

బరంపురం – సూరత్ (ఉధ్నా) అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణానికి ముందస్తు రిజర్వేషను ప్రక్రియ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభించారు. బరంపురం నుంచి సూరత్ (ఉధ్నా) ప్రయాణ చార్జీ రూ.795గా నిర్ణయించారు.

వర్షాలపై సీఎం సమీక్ష



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి
- నదీ తీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలి
- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న భారీ వర్షాలు, అల్పపీడన ప్రభావంపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సమీక్షించారు. ఈ సందర్భంగా ఝార్సుగుడలో శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ముందస్తుగా ఝార్సుగుడలో సీఎం సభ చేశారు. అక్కడి ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు. ఐఎండీ హెచ్చరించిన అల్పపీడన వ్యవస్థ మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉంది. విస్తృత వర్షాలు కురుస్తాయని భావిస్తున్నారు. ఈ సమావేశంలో జిల్లా యంత్రాంగం సన్నద్ధత, సంభావ్య వరదలు, పంట నష్టం, ముఖ్యమైన సేవలకు అంతరాయం లేకుండా చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. అధికారులు అత్యంత అప్రమత్తతతో కంట్రోల్ రూమ్ వ్యవస్థని ఏర్పాటు చేసి రాత్రీ పగలూ పని చేయాలన్నారు. అవసరమైన చోట సహాయక, తరలింపు కార్యకలాపాలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నదీ తీరాలను నిశితంగా పర్యవేక్షించడం, త్వరిత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, దుర్బల ప్రాంతాలలో ప్రాణహాని, ఆస్తి నష్టం నివారణ, అత్యవసర ఆరోగ్య సంరక్షణ సేవల సన్నద్ధతపై సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రత్యేక సహా కమిషనరు సత్యబ్రత సాహు, పలు సంభావ్య ప్రభావిత ప్రాంతాల జిల్లా యంత్రాంగం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

జల దిగ్బంధంలో భట్టారిక పీఠం



కటక్ జిల్లా బొడొంబా ప్రాంతంలో భట్టారిక పీఠం వరద దిగ్బంధంలో చిక్కుకుంది. హీరాకుద్ జలాశయం నుంచి వరద నీరు విడుదల చేయడంతో లోతట్టు మహానది తీరంలో ఉన్న ఈ పీఠంలోనికి వరద చొరబడింది. ఆలయం ఆవరణ వరద దిగ్బంధంలో ఉంది. గర్భాలయంలోనికి నీరు చొరబడితే పూజలందుకుంటున్న భట్టారిక మాత విగ్రహాన్ని పాక శాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆలయంలో నవ రాత్రి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. – భువనేశ్వర్

రేబిస్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి



రాజవీధిగుండా ర్యాలీ చేస్తున్న సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ విద్యార్థులు

పర్లాకిమిడి: రేబిస్ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని వక్తలు అన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని సెంచూరియన్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ అసోసియేట్ డీన్ (ఎక్స్‌టెన్షన్) డాక్టర్ గిరీష్ కుమార్ మహంతి మాట్లాడుతూ.. వీధి, పెంపుడు కుక్కలకు విధిగా వాక్సిన్ వేయించాలని, అలాగే కుక్క కరిచినప్పుడు రేబిస్ ఇంజక్షన్లు వాడాలని అన్నారు. స్థానిక గజపతి ప్యాలస్ నుంచి మహారాజా బాలుర ఉన్నత పాఠశాల జంక్షన్ వరకూ సెంచూరియన్ వర్సిటీ స్కూల్ ఆఫ్ వెటర్నరీ, యానిమల్ హాజ్‌బెండ్రీ విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ప్రాణిచికిత్స, పశుసంవర్ధక శాఖ డీన్ (అడ్మిన్) డాక్టర్ ఎస్.పి.నందా, సర్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

రాయగడ: హత్యాయత్నం కేసులో నిందితుడు సుశాంత్ సబర్‌కు నాలుగేళ్ల జైలు శిక్షను విధిస్తు గుణుపూర్ ఎస్‌డీజేఎం కోర్టు తీర్పునిచ్చింది. జైలు శిక్షతో పాటు మరో పదివేల రూపాయల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. జరిమానా చెల్లించలేని పక్షంలో అదనంగా మరో నాలుగు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొంది. వివరాల్లోకి వెళితే.. 2024 జూన్ 15వ తేదీన గుణుపూర్ పరిధిలోని ఘనంతి గ్రామంలో అజిత్ కుమార్ సబర్‌పై అదే గ్రామానికి చెందిన సుశాంత్ సబర్ హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో బాధితుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కేసు విచారణకు రాగా ఎస్‌డీజేఎం 23 మంది సాక్షులను విచారించిన అనంతరం తన తుది తీర్పును ఇచ్చారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

- జీఐఈటీ విశ్వవిద్యాలయంలో ఘటన



రుద్ర నారాయణ్ (ఫైల్)

రాయగడ: గుణుపూర్‌లోని గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయంలో బయోటెక్ విభాగం మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న గుణుపూర్ ఆదర్శ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు గంజాం జిల్లాలోని ఛత్రపూర్ ప్రాంతానికి చెందిన రుద్ర నారాయణ్ (20)గా గర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

లక్ష్మీదేవి అవతారంలో దుర్గమ్మ దర్శనం



మజ్జిగౌరి మందిరం సన్నిధిలో అఖండ దీపారాధన



కరెన్సీనోట్లతో లక్ష్మీదేవి లక్ష్మీ

రాయగడ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక కస్తూరీనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో కొలువైయున్న లక్ష్మీదేవిని ఈ సందర్భంగా కరెన్సీనోట్లతో అలంకరించారు. ఉత్కళాంధ్రుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి సన్నిధిలో అఖండ దీపాలను వెలిగించారు. దీపాల కాంతులతో అమ్మవారు ధగధగమని కనిపిస్తున్నారు. సునాబేసో మరికొంత ఆకర్షనీయంగా మారింది. భక్తుల సందడి పెరిగింది.

గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు

- 615 కిలోల గంజాయి పట్టివేత
- ఇద్దరు అరెస్టు



కోరుకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, పట్టుబడిన నిందితులతో పోలీసు సిబ్బంది

మల్కన్‌గిరి: గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టయింది. ట్రక్‌లో భారీగా తరలిస్తున్న గంజాయిని మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గురువారం రాత్రి కోరుకొండ ఐఐసీ హిమాంశు శేఖర్ బారిక్ తన సిబ్బందితో మల్కన్‌గిరి–బలిమెల మార్గంలో తర్లకొట్ట గ్రామం ఘటీ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఓ ట్రక్ అతివేగంగా వస్తుండంతో అనుమానం వచ్చి దాన్ని నిలిపివేసి తనిఖీ చేశారు. అందులో 25 బస్తాల్లో ఉన్న గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో దాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని శుక్రవారం ఉదయం అధికారులు తూకం వేయగా.. 615 కిలోలు ఉన్నట్టు గుర్తించారు. దీని విలువ సుమారు రూ. 50 లక్షలు ఉంటుందన్నారు. గంజాయిని మల్కన్‌గిరి జిల్లా నుంచి రాజిస్థాన్‌కు తరలిస్తున్నట్టు విచారణలో వెల్లడైనట్టు పోలీసులు పేర్కొన్నారు. అరెస్టయిన వ్యక్తులు కలిమెల సమితి మోటు తాహశ్లీ మహదేవ్ ప్రభుత్వ, రాజిస్థాన్‌కు చెందిన బాగీరాద్ మేఘవాల్‌గా గుర్తించామని ఐఐసీ హిమాంశు బారిక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.



బలిమెల పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులు

బలిమెల పోలీసుల తనిఖీల్లో..

మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీస్ ఐఐసీ దీరాజ్ పట్నాయక్ ఆదేశాల మేరకు ఎస్ఐ మిలన్ బార గురువారం రాత్రి ఓరంగి గ్రామం వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో చిత్రకొండ నుంచి కొరపూట్‌కు బైక్ పై ఇద్దరు వ్యక్తులు ఓ బస్తాను తీసుకొని వస్తుండగా.. అనుమానంతో వారిని తనిఖీ చేయగా బస్తాలో పది కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరి అరెస్టు చేశారు. ఐఐసీ ధీరాజ్ పట్నాయక్ వీరిని విచారించగా.. రామ్ కిర్సనీ, జయ కిర్సనీలుగా తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టుకు తరలించామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 50 వేలు ఉంటుందన్నారు.

ఒడిశా సివిల్ సర్వీసెస్ టాపర్‌గా ప్రియాంషు పాల్

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్సీ) నిర్వహించిన ఒడిశా సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, 2023 అభ్యర్థుల తుది ఎంపిక జాబితాను శుక్రవారం విడుదల చేసింది. 398 మంది అభ్యర్థులతో కూడిన ఈ జాబితాలో 144 మంది యువతులు చోటుదక్కించుకోవడం విశేషం. ఇందులో ప్రియాంషు పాల్ ప్రథమ స్థానంతో ఓఏఎస్ 2023లో టాపర్‌గా నిలిచారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ప్రధాన రాత పరీక్షలు, సెప్టెంబర్‌లో ఇంటర్వ్యూలు జరిగాయి. ఇందులో ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. వీరందరి ధృవ పత్రాల పరిశీలన మేరకు తుది నియామకాలు జరుగుతాయి.

టాప్‌టెన్ అభ్యర్థులు వీరే..

ప్రియాంషు పాల్, అనన్య మిశ్రా, శోభన్ పట్నాయక్, మీర్జా ఫయాజ్ అహ్మద్ కాద్రి, చిన్మయ సాహు, అంతిమ్ స్వాయి, శైలేష్ కుమార్ భొయి, మహమ్మద్ నజీఫ్ హాతీఫ్, చిన్మయ కుమార్ పాఢి, మిలన్ మహాపాత్రో

ముఖ్యమంత్రి శుభాకాంక్షలు..



ప్రియాంషు పాల్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సేవా రంగం లోకి కొత్తగా సుమారు 400 మంది యువతీయువకులు అడుగుపెడుతున్న సివిల్ సర్వీసెస్ ఉద్యోగులను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. సేవ దృక్పథంతో ఉద్యోగ జీవితానికి శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఎంపీ



అధికారులతో కలిసి వార్డులను పరిశీలిస్తున్న ఎంపీ భోలాభద్ర మాఝి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఆస్పత్రిని నవరంగ్‌పూర్ పార్లమెంటు సభ్యుడు భోలభద్ర మాఝి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి బ్రోజాదాస్‌తో చర్చించారు. లిఫ్ట్ పని చేయడం లేదని, నీటి సమస్య ఉందని వైద్యులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. రోగుల కోసం మరికొన్ని పడకలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ రుణాల కోసం ఆందోళన



సవర చొర్లంగిలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

హిరమండలం : వ్యవసాయ రుణాలు అందించాలని హిరమండలం మండలంలోని 50 గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం సవర చొర్లంగిలో గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. గతంలో డీపట్టా భూములకు బ్యాంకులు ద్వారా రుణాలు అందేవని, భూముల రీ సర్వే తర్వాత 1బీ అడంగల్ రాకపోవడంతో రుణాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1బీ ఉంటేనే రుణాలు ఇస్తాం.. రెన్యూవల్ చేస్తామని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వ్యవసాయ రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. నిరసన కార్యక్రమంలో గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



వంట గదులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

గార: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శుక్రవారం అంపోలు జిల్లా జైలును సందర్శించారు. ముద్దాయిలకు అందించే ఆహార పదార్థాలను రుచి చూశారు. గ్రంథాలయం, మహిళా బ్యారెక్‌లు పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. పలువురి నుంచి బెయిల్ పిటీషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జైలర్ దివాకర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


గంజాయితో వ్యక్తి అరెస్టు



నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

పలాస: తమిళనాడు రాష్ట్రానికి చెందిన మోరీస్ అనే వ్యక్తిని గంజాయితో శుక్రవారం అరెస్టు చేసినట్లు పలాస జీఆర్‌పీ ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు తెలియజేశారు. పలాస రైల్వేస్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫామ్‌లో తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా తిరుగుతూ కనిపించాడన్నారు. అతని బ్యాగ్‌లో తనిఖీలు చేయగా గంజాయి పట్టుబడినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో రాయగడలో కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయిని తూకం వేయగా 14 కిలోలు ఉన్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ



ప్రథమ చికిత్స శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై ఒక్కరోజు శిక్షణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రథమ చికిత్స శిక్షణతో ఎంతో ప్రయోజనం ఉందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ ప్రథమ చికిత్స శిక్షణ ప్రతి ఒక్కరికీ ఈ రోజుల్లో అవసరమని, ప్రాణనష్టం తగ్గించడంలో ప్రధాన భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం అభ్యర్థులకు ధృవపత్రాలు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని బలవన్మరణం



కుమార్తె మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి బృందవాన్



అంకితా విశ్వస్ (ఫైల్)

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఎంవీ 13 గ్రామంలో ఉంటున్న విద్యార్థిని అంకితా విశ్వస్ (21) గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. బృందవాన్ విశ్వస్ తన కుటుంబంతో మల్కన్‌గిరి సమితి ఎంవీ 13 గ్రామంలో నివసిస్తూ కుమార్తె అంకితా విశ్వస్‌ను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కాలేజీలో నర్సింగ్ చదివిస్తున్నారు. ప్రస్తుతం ఆమె బీఎస్సీ నర్సింగ్ చివరి సంవత్సరం చదువుతుంది. బుధవారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా. కుటుంబీ సభ్యులు మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేసి రక్షించగా.. గురువారం ఉదయం ఇంటికి వచ్చేశారు. అయితే గురువారం రాత్రి అంతా భోజనాలు చేసిన తరువాత నిద్రకు ఉపక్రమిస్తుండగా అంకితా విశ్వస్ తన గదిలో ఫ్యాన్‌కు ఉరువేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కూతుర్ని గమంచిన తండ్రి వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ప్రకటించారు. సమాచారం అందుకున్న మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు. తన కుమార్తె ఎవరినో ప్రేమించిందని.. అయితే ప్రేమించిన వ్యక్తి పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందిన అఘాయిత్యానికి పాల్పడింది తండ్రి బృందావన్ పోలీసులకు చెప్పారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు పోలీసులు వెల్లడించారు.

పుస్తెల తాళ్లు చోరీ



రణస్థలం: సీసీ పుటేజీలో నమోదైన మహిళల దృశ్యాలు

పాతపట్నం: మండలంలోని పాశీగంగుపేట, చంద్రయ్యపేట గ్రామాల్లో ఇంట్లోని నిద్రిస్తున్న ఇద్దరు మహిళలు మెడల్లో నాలుగు తులాల బంగారం పుస్తెల తాళ్లు చోరీకి గురయ్యాయని ఎస్‌ఐ కె.మధుసూధనరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాశీగంగుపేట గ్రామానికి చెందిన గంగు రాము, అతని భార్య గంగు లక్ష్మి అలియాస్ మీరమ్మలు గురువారం రాత్రి ఇంట్లో నిద్రించారు. అయితే అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి లక్ష్మి మెడలోని రెండు తులాల బంగారం పుస్తెల తాడును చోరీ చేశాడు. అలాగే చంద్రపేట గ్రామానికి చెందిన మొర్రి వెంకటరమణ, అతని భార్య మొర్రి పద్మవతిలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలోనూ మెడలోని రెండు తులాల బంగారం పుస్తలతాడు చోరి జరిగినట్లు తెలిపారు. రెండు చోరీలపై కేసు నమోదు చేశారు.

బంగారం దుకాణంలో చోరి

రణస్థలం: లావేరు మండలంలోని బుడుమూరు గ్రామ రహదారికి ఆనుకుని ఉన్న శ్రీవిజయదుర్గా బంగారు నగల దుకాణంలో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. బంగారు వస్తువులతో పాటుగా వెండి వస్తువులను అపహరించారు. కలిశెట్టి గూడెం గ్రామానికి చెందిన కలిశెట్టి కృష్ణ బుడుమూరులో బంగారం దుకాణం నడుపుతున్నాడు. షాపునకు శుక్రవారం మధ్యా హ్నం గుర్తు తెలియని ముగ్గురు మహిళలు నగలు కొనుగోలుకు చేసేందుకు వచ్చారు. యజమానిని మాటల్లో పెట్టి బేరమాడారు. అనంతరం కొనుగో లు చేయకుండానే వెనుదిరిగారు. వారు షాపు విడి చి వెళ్లగా సీసీ పుటేజీ పరిశీలించిన యాజమాని కృష్ణ చోరీ జరిగిందని గుర్తించారు. సుమారు 3 గ్రాముల బంగారం ముక్కు పుడకలు నాలుగు, 480 గ్రాముల 6 జతల వెండి పట్టీలు చోరికి గురైనట్లు గుర్తించారు. వీటి విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు.

మద్యం దుకాణానికి వ్యతిరేకంగా ఆందోళన



బీడీవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

జయపురం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సారా దుకాణం పెట్టాలన్న ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆలిండియా ఎంఎస్‌ఎస్ (ఆలిఇండియా మహిళా సంస్కృతిక సంఘటన) బొయిపరిగుడ సమితి కమిటీ ఆందోళన చేపట్టింది. సారా దుకాణం ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ బొయిపరిగుడ బీడీవోకు వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలు, విద్యార్థినులపై లైంగిక దాడులు పెరిగాయని నినాదాలు చేశారు. కొరాపుట్ జిల్లా ఆలిండియా మహిళా సంస్కృతిక సంఘటన కార్యదర్శి లక్ష్మీ బారిక్ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'బాటలో పాఠశాల విద్యార్థులు



విద్యార్థులు మత్తు పదార్థాలు సేవిస్తున్న వీడియో ఇదే..

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదలలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధీనంలోని ప్రభుత్వ మాధ్యమిక ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలు సేవిస్తున్న వీడియో సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీనికి సంబంధించి నలుగురు విద్యార్థులకు హెచ్‌ఎం కొలా బామనమూర్తి టీసీలు ఇచ్చి ఇంటికి పంపించినట్లు సమాచారం. ఇటీవల నలుగురు విద్యార్థులకు టీసీలు ఇచ్చారన్న వార్తలు మీడియాలో ప్రచురితం కావడంతో.. ఎందుకు ఇచ్చారో తెలియజేయాలని కోరడంతో రెండు రోజుల క్రితం వాట్సాప్ గ్రూప్‌లో విద్యార్థుల వీడియోను పోస్టు చేశారు. కాగా, విద్యార్థులు తప్పుడు పనులు చేస్తే మందలించాల్సింది పోయి.. ఇలా టీసీలు ఇవ్వడం.. వీడియోను పోస్టు చేయడంపై తల్లిదండ్రులు తీవ్ర వేదనకు గురయ్యారు. ఈ ఘటనపై జిల్లా అధికార యంత్రాంగం సమగ్ర దర్యాప్తు చేయాలని ఉన్నత స్థాయి అధికారులను కోరారు.

డీసీసీ అధ్యక్షుడిగా అప్పలస్వామి కద్రక



అప్పలస్వామి కద్రక

రాయగడ: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా రాయగడ శాసనసభ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక నియమితులయ్యారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సాధారణ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కద్రకను ఆయన అభిమానులు, కార్యకర్తలు అభినందించారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

అడాబడిలో దొంగల హల్‌చల్



బాధితురాలు సఫాయి హికక

రాయగడ: ఓ వృద్ధురాలి చెవిదిద్దులను గుర్తు తెలియని వ్యక్తులు తెంచుకువెళ్లిన ఘటన కళ్యాణసింగుపూర్ సమితి అడాబడి గ్రామంలో చోటు చేసుకుంది. ధమునిపొంగ పంచాయతీ గుండిరిగుడ గ్రామానికి చెందిన సఫాయి హికక (73) అనే వృద్ధురాలు స్టేట్‌బ్యాంక్‌కు వ్యక్తిగత లావాదేవీల కోసం గురువారం వచ్చింది. బ్యాంకు పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఒడాబడి కూడలిలో గుర్తు తెలియని ముగ్గురు దుండగులు అడ్డగించి చెవిలో దిద్దులను దొంగిలించుకుని వెళ్లిపోయారు. చెవి తెగి రక్తం కారుతుండటంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో బాధితురాఉల ఫిర్యాదు చేసింది.

మనస్థాపంతో ఆత్మహత్య

బూర్జ: మండలంలోని ఉప్పినివలస గ్రామానికి చెందిన బొమ్మాళి శిరీష (22) గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శిరీషకు తల్లిదండ్రులు వివాహ సంబంధాలు చూస్తుండగా ఆమె తిరస్కరిస్తూ ఉండేది. వివాహం చేసుకోనని.. తన చిన్నాన్న దగ్గర చదువుకుంటానని చెప్పేది. ఈ క్రమంలో బుధవారం భోజనాల తర్వాత పక్క ఇంటికి వెళ్లి మాట్లాడుతుండగా, ఆమె తల్లి తనకు సాయం చేయకుండా పక్క ఇంటికి ఎందుకు వెళ్లావని మందలించడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉన్నటువంటి గడ్డిమందు తాగేసింది. తల్లి గన్నెమ్మ చూసి వెంటనే 108 సాయంతో శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి తండ్రి రాజు, తల్లి గన్నెమ్మ, అక్క దివ్య, డిగ్రీ చదువుతున్న తమ్ముడు మని ఉన్నారు. తల్లి గన్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక తెలియజేశారు.

టికిరిని సమితిగా గుర్తించాలి



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధుల బృందం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీని సమితిగా గుర్తించాలని కోరుతూ ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝికి ఆ ప్రాంత ప్రతినిధులు గురువారం వినతిపత్రం సమర్పించారు. కాసీపూర్ సమితిలో 24 పంచాయతీలు ఉండగా సుమారు లక్షకు పైబడి జనాభా ఉన్నారని చెప్పారు. జనాభాపరంగా అభివృద్ధి చెందుతున్న కాసీపూర్ సమితిని విభజించి టికిరి పంచాయతీని సమితిగా గుర్తిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. టికిరి సమితిగా ఆవిర్భవిస్తే కొడాపరి, డొంగాశిలి, కుచేయిపాదొరొ, హడిగుడ, పొడాపడి, బంకాంబ, నకిటిగుడ, శొంకరడ, దుడుకాబహాల్, గోరఖ్‌పూర్ పంచాయతీలు విలీనమవ్వడంతో అభివృద్ధిని సాధిస్తాయని పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే బిభీషన్ మాఝి తదితరులు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి



అతిథులతో నిర్వాహకులు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయక్ తదితరులు

రాయగడ: క్రీడాకారులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే అందుకు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పాటు క్రీడా స్ఫూర్తి ఎంతో అవసరమని జిల్లా అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్ అన్నారు. స్థానిక బిజు పట్నాయక్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం రాయగడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఒ అన్నాసాహెబ్, జిల్లా క్రీడాశాఖ అధికారి షేక్ ఆలీనూర్, జేకేపేపర్ మిల్ సీఎస్ఆర్ స్మతిరేఖ కొరా, రాయగడ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు హిమాంశు శేఖర్ పండియా తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం



సత్కారం అందుకుంటున్న విశ్రాంత ఉద్యోగులు

పర్లాకిమిడి: ఉత్కళ గ్రామీణ బ్యాంకు (ఒడిశా) విశ్రాంత ఉద్యోగుల సంఘం పర్లాకిమిడి ప్రాంతీయ కమిటీ ప్రతినిధులు 70 ఏళుదాటిన విశ్రాంత ఉద్యోగులను శుక్రవారం సన్మానించారు. సత్కారం పొందిన వారిలో సీహెచ్ భువనేశ్వర్‌రావు, దోసపాటి వెంకట రామచంద్రరావు, కె.వి.ఎల్.పట్నాయిక్ ఉన్నారు. బరంపురం ఉత్కళ గ్రామీణ బ్యాంకు యూనియన్ సభ్యులు మాధవ కోరియా, ప్రమోద్ కుమార్ పట్టజోషి, దిగంబర పండా, పర్లాకిమిడి ప్రాంతీయ కమిటీ సభ్యులు శివప్రసాద్ పట్నాయిక్, చందన రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సత్కారం



ఎన్‌సీసీ కేడేట్స్, పీవోను సత్కరిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు బాలికల ఎన్‌సీసీ కేడెట్లు, పీవోను శుక్రవారం అధికారులు సత్కరించారు. విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ఎన్‌సీసీ అధికారి సంతోషినీ ముండ, కేడెట్లు స్వాతీ జాని, నగమ నిగోర్, శక్తిశ్రీయ పట్నాయక్‌లు న్యూఢిల్లీలో నిర్వహించిన అఖిల భారత స్థాయి సేవా క్యాంప్‌లో పాల్గొన్నారు. వీరు రాష్ట్ర రాజధానిలో మూడు నెలలు శిక్షణపొంది ఒడిశా తరఫున న్యూఢిల్లీలో జరిగిన జాతీయస్థాయిలో జరిగిన శిబిరంలో పాల్గొని ప్రతిభకనబర్చారు. ఈ సందర్భంగా వారిని విక్రమదేవ్ విశవిద్యాలయ రిజిస్ట్రార్ మహేశ్వర చంద్ర నాయిక్ తదితరులు అభినందించి సత్కరించారు.

- వరుస తుఫాన్లతో మత్స్యకారుల ఆకలి కేకలు
- వేట నిషేధం తర్వాత ఐదుసార్లు తుఫాన్ హెచ్చరికలు
- ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబాలు
- ఆదుకోవాలని వేడుకోలు

వేట సాగక.. పూట గడవక..!



తుఫాన్‌తో వేట సాగని రోజులు
జూన్ 30వ తేదీ నుంచి 2 రోజులు
జూలై 24వ తేదీ నుంచి 6 రోజులు
ఆగస్టు 13వ తేదీ నుంచి 8 రోజులు
ఆగస్టు 26వ తేదీ నుంచి 5 రోజులు
సెప్టెంబర్ 22వ తేదీ నుంచి 8 రోజులు

గార:

కడలి తల్లి కరుణిస్తే గానీ కడుపు నిండని పరిస్థితి మత్స్యకారులది. వేట సాగితేనే కుటుంబాల పూట గడుస్తుంది. అయితే ఇటీవల వరుసగా ఏర్పడుతున్న తుఫాన్లు మత్స్యకారుల్లో ఆందోళన సృష్టిస్తున్నాయి. సంద్రం అల్లకల్లోలంగా మారుతుండడంతో వేట సాగడం లేదు. వేట నిషేధం అనంతరం వరుసగా నాలుగు నెలల్లో ఏకంగా 27 రోజుల పాటు తుఫాన్లు, వాయుగుండాల ప్రభావం వలన వేటకు వెళ్లలేకపోయారు. దీంతో ఆయా కుటుంబాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో ఎక్కడ తుఫాన్ సంభవిస్తున్నా వాతావరణ హెచ్చరికలు ఆధారంగా అప్రమత్తత పేరుతో వేట నిలిపేయాలని అధికారులు దండోరా వేయిస్తున్నారు. కానీ ఒక్కోసారి వాతావరణ హెచ్చరికలకు విరుద్ధంగా సముద్రంలో ఎటువంటి ఒడిదుడుకులు లేకపోయినా వేటకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండిపోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. అందువలన ప్రతీ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు వేట నిషేధ సమయంలో భృతి ఇస్తున్నట్టే.. తుఫాన్, వాయుగుండాల సమయంలో వేటకు వెళ్లకుండా అర్థిక ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులకు భృతి ఇవ్వాలని కోరుతున్నారు.



వేట నిలిచిపోవడంతో బందరువానిపేట తీరంలో ఉన్న పడవులు

జిల్లాలో పరిస్థితి

జిల్లాలో 193 కిలోమీటర్ల మేర ఉన్నటువంటి తీర ప్రాంతంలోని 11 మండలాల్లో మత్స్యకారులు జీవనోపాధి సాగిస్తున్నారు. మొత్తం 1,526 మెకనైజ్డ్ బోట్లు, 2,606 నాన్ మెకనైజ్డ్ బోట్లుపై వేట సాగిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేట నిషేధ భృతి అర్హులైన మత్స్యకారులందరికీ అందిస్తే.. కూటమి ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టి మత్స్యకారులను తగ్గించిందన్న విమర్శలున్నాయి. అలాగే అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకార భృతి ఒక సంవత్సరం ఇవ్వకపోవడం గమనార్హం.

పస్తులతో జీవనం



కొన్ని రోజులుగా సముద్రంలో వేట సక్రమంగా సాగడం లేదు. తరుచూ తుఫాన్‌లు ఏర్పడడంతో సముద్రం అల్లకల్లోలంగా మారుతోంది. ఏ రోజుకారోజు వేట సాగించి జీవిస్తుంటాం. ఈ సమయంలో రోజుల తరబడి వేట సాగకపోతుండడంతో జీవనం కష్టతరంగా ఉంటోంది. పస్తులతో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఈ ఏడాది ఎక్కువగా వాయుగుండాలు, తుఫాన్లు వస్తుండడంతో బోట్లు, వలలు భద్రపర్చుకోవడం కష్టతరంగా మారుతోంది.

– పుక్కళ్ల తవిటయ్య, మత్స్యకారుడు, బందరువానిపేట

ప్రత్యేక భృతి ప్రకటించాలి



సముద్రంలో వేట సాగించేందుకు వాతావరణం అనుకూలంగా ఉండడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వేటకు విరామం తప్పడం లేదు. వేట నిషేధ భృతి మాదిరిగానే వేట విరామ సమయంలో మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేలా ప్రత్యేక భృతిని ప్రకటించాలి. జీవనోపాధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మత్స్యకార భరోసా రెండేళ్లకు ఒక ఏడాది మాత్రమే అందించారు. మరో ఏడాది భరోసా అందించి ఆదుకోవాలి.

– కోనాడ నర్సింగరావు, జిల్లా మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు

పోక్సో కేసు నమోదు

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఒక బాలికను ప్రేమ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్న అభియోగంపై శావసానపుట్టుగకు చెందిన విశ్వనాథంపై పోక్సో కేసు గురువారం నమోదు చేసినట్లు కవిటి ఎస్‌ఐ వి.రవివర్మ శుక్రవారం తెలిపారు.

రాకపోకలకు అంతరాయం

ఆమదాలవలస రూరల్: మండలంలోని తొగరాం గ్రామం వద్ద ఇసుక లారీ వలన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాతూరు ఇసుక ర్యాంపు నుంచి అధిక బరువుతో వచ్చిన లారీ రహదారికి అడ్డంగా ఆగిపోయింది. దీంతో ఇరువైపుల నుంచి వచ్చిన వాహనాలు రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పలు వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. సుమారు ఆరు గంటలపాటు బస్సులు, ఆటోలతో పాటు అనేక భారీ వాహనాలు నిలిచిపోవడంతో అవస్థలు తప్పలేదు.

జిల్లా ఆర్‌ఐఓగా సురేష్‌కుమార్



రేగ సురేష్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా ప్రాంతీయ పర్యావరణాధికారి(ఆర్ఐఓ)గా రేగ సురేష్‌కుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డ్ డైరెక్టర్ /సెక్రెటరీ నారాయణ భరత్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సురేష్‌కుమార్ జిల్లా ఇంటర్మీడియట్ విద్య డీవీఈవోగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు ఆర్ఐఓగా పని చేసిన ప్రగడ దుర్గారావు ఈ నెలతో ఉద్యోగ విరమణ చేయనుండటంతో డీవీఈవో సురేష్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారుల పర్యటన

విజయనగరంఫోర్ట్: వరిపంటకు తెగుళ్లు ఆశించడంతో రైతులకు సూచనలు, సలహాలు అందించేవారు లేక అవస్థలు పడుతున్న అంశంపై సాక్షిలో శుక్రవారం 'వరిపంటపై తెగుళ్ల దాడి' వార్తకు వ్యవసాయ అధికారులు స్పందించారు. ఈ మేరకు విజయనగరం మండలంలో మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్, వీఏఏ శోభలు రాకోడు, పినవేమలి, కోరుకొండ గ్రామాల్లో పర్యటించి వరి పంటకు ఆశించిన తెగుళ్లను గుర్తించి వాటినివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. గంట్యాడ మండలంలోని పెదవేమలి గ్రామంలో వీఏఏ రమేష్ రైతుల పొలాలను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

నవదుర్గ ఆలయంలో చోరీ


ఆలయంలో పరిశీలిస్తున్న రూరల్ పోలీసులు

పార్వతీపురం రూరల్: మండలంలోని పెద బొండపల్లి గ్రామంలో గల శ్రీ నవదుర్గ మాత ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన చిల్లర నాణాలను దోచుకెళ్లినట్లు ఆలయ ధర్మకర్త ఎస్.రాజ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై వివరాలు వెల్లడిస్తూ గురువారం హుండీలో లెక్కించిన చిల్లర డబ్బులు ఆలయంలో ఉన్న ట్రంకుపెట్టెలో భద్రపరచగా గుర్తుతెలియని దుండగులు రూ.1000లు చోరీ చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేందుకు వచ్చిన ధర్మకర్త రాజ్యలక్ష్మి చోరీ జరిగినట్లు గుర్తించి తమకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోషికుమారి తెలిపారు.

పైడితల్లి జాతరకు 2వేల మందితో బందోబస్త్

విజయనగరం క్రైమ్: పైడితల్లి తొలేళ్లు, సిరిమానోత్సవానికి 2వేల మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ స్పష్టంచేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉత్సవ బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఆలయం ప్రాంగణం సమీపంలో తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా పెట్టాలన్నారు. సీసీ కెమెరాలను పోలీస్ కంట్రోల్ రూంలోని టీవీలకు అనుసంధానం చేయాలన్నారు. పండగలో జేబు దొంగతనాలు, చైన్ స్నాచింగ్స్ జరగకుండా ప్రత్యేకంగా క్రైం బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, విజయనగరం ఇన్‌చార్జి డీఎస్పీ ఆర్.గోవిందరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, టి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, సూరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కఠిన శిక్షలతోనే వేధింపులకు అడ్డుకట్ట

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో మహిళలపై వివక్ష, దాడులు జరుగుతున్నాయని, మూడేళ్ల బాలిక నుంచి 60 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. అశ్లీల చిత్రాలు చూడడమే దీనికి కారణమన్నారు. కలెక్టరేట్‌లో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వేధింపులు చెప్పుకోలేక కొంతమంది మహిళలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని తెలిపారు. శిక్షలు కఠినంగా ఉన్నప్పుడే వేధింపులకు పాల్పడడానికి భయపడతారని అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల్లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఆడపిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. పిల్లలకు సురక్షితమైన భద్రత కల్పిస్తున్నామా?లేదా? అనే అంశాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. పిల్లలు, మహిళలు బాగుంటేనే సమాజం బాగుంటుందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ఎంత మంది ఉపయోగించుకుంటున్నారని చేతులు ఎత్తమని అడగ్గా కేవలం ఇద్దరు మాత్రమే చేతులు ఎత్తడం గమనార్హం. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ముద్దాయిలు కూడా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చన్నారు. కుటుంబంలో భార్యాభర్తల మధ్య గొడవలు వస్తే కుటుంబ సభ్యులందరూ కలిసి కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. బాలికలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయని, దీనికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, మహిళా కమిషన్ డైరెక్టర్ నాగమణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కవిత, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సాయి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సాగుదీత..!

మట్టిలో పుట్టి..మట్టిలో పెరిగి..మట్టితల్లినే నమ్ముకుని..పెట్టుబడులు పెట్టి..ఇంటిల్లిపాదీ స్వేదం చిందించి పదిమందికి పట్టెడన్నం పెట్టే అన్నదాత పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. అయితే అతివృష్టి..లేదంటే అనావృష్టి పరిస్థితులు రైతన్నలను కుంగదీస్తుంటే..ఆదుకోవాల్సిన సర్కారు వారిని మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తోంది. సాగు సమయంలో అవసరమైన ఎరువులను సరఫరా చేతకాకపోయినప్పటికీ..సాగు చేసిన పంటల ఈ క్రాప్ నమోదును కూడా పూర్తి చేయలేకపోతోంది. ఈ పరిస్థితులు అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తూ వ్యవసాయానికి స్వస్తి పలికే స్థితికి తీసుకువస్తున్నాయి.

- ఆందోళనలో అన్నదాతలు
- నిన్న యూరియా కొరత..నేడు ఈక్రాప్‌లో అలసత్వం
- జిల్లాలో 57శాతం పూర్తయిన ఈ క్రాప్ నమోదు
- గడువు ఇంకా మూడు రోజులే


మొక్కజొన్న పంట వద్ద ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పార్వతీపురం రూరల్: పంట నష్టపరిహారం అందాలన్నా, పంటల బీమా వర్తించాలన్నా, సున్నా వడ్డీకే రుణం రావాలన్నా..ఆఖరికి పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలన్నా..వాటన్నింటికీ ప్రభుత్వ గుర్తింపు కావాలి. ఆ గుర్తింపునకు ఏకైక ఆధారం 'ఈ-క్రాప్' నమోదు. అలాంటి కీలకమైన ప్రక్రియ మన్యం జిల్లాలో అటకెక్కింది. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు వస్తున్నా, ఈ-క్రాప్ నమోదు మాత్రం నత్తనడకన సాగుతోంది. గడువు సెప్టెంబర్ 30తో ముగుస్తుండగా, ఇంకా 43 శాతం పంటల వివరాలు ఆన్ లైన్‌లో నమోదు కాకపోవడంతో అన్నదాతల గుండెల్లో ఆందోళన మొదలైంది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం రైతుల పాలిట శాపంగా మారుతోంది.

నమోదులో జాప్యం..నష్టపోయేది రైతే

మన్యం జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పంటలు 3,09,671 ఎకరాల్లో సాగవగా, ఇప్పటివరకు కేవలం1,76512 ఎకరాల్లో మాత్రమే ఈ క్రాప్ నమోదు పూర్తయింది. అంటే, జిల్లాలో కేవలం 57 శాతం మాత్రమే పూర్తి కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మరో మూడు రోజుల్లో మిగిలిన 43 శాతం ఎలా పూర్తి చేస్తారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ముఖ్యంగా పార్వతీపురం నియోజకవర్గంలో 47 శాతం నమోదు కాగా, సాలూరులో 65 శాతంతో కాస్త మెరుగ్గా ఉంది. పాలకొండలో 54శాతం, కురుపాంలో 60శాతం నమోదైంది. గడువులోగా ఈ క్రాప్ నమోదు పూర్తి కాకపోతే, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, పంటనష్టం జరిగినా ప్రభుత్వ సాయం అందే అవకాశం ఉండదు. ఇది రైతులకు తీవ్రంగా నష్టం చేకూరుస్తుంది.

కొరవడిన సమన్వయం

ఈ-క్రాప్ ప్రక్రియ క్షేత్రస్థాయిలో సజావుగా సాగాలంటే వ్యవసాయ సహాయకులు (వీఏఏ), గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్‌ఓ) కలిసి పనిచేయాలి. కానీ ఆచరణలో ఇది జరగడం లేదు. రెవెన్యూ సిబ్బంది ఈ ప్రక్రియకు దూరంగా ఉంటుండడంతో వ్యవసాయ శాఖ సిబ్బందిపైనే భారం పడుతోంది. ఇటీవల జరిగిన బదిలీల కారణంగా చాలా మంది వీఏఏలకు గ్రామాల్లోని పొలాలపై సరైన అవగాహన లేదు. దీనికితోడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కరువైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సిబ్బందిలో నిర్లక్ష్యం తాండవిస్తోందని, ప్రక్రియను మమ అనిపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

సాంకేతిక సమస్యల సుడిగుండం

సమన్వయ లోపంతో పాటు సాంకేతిక సమస్యలు కూడా ఈ-క్రాప్ నమోదుకు అడ్డంకిగా మారాయి. మారిన నిబంధనల ప్రకారం సర్వే నంబర్ వారీగా పొలాన్ని జియో-ట్యాగింగ్ చేసి, ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీనికి ఎక్కువ సమయం పట్టడంతో పాటు, అనేక మారుమూల గ్రామాల్లో సిగ్నల్ సమస్యలు వేధిస్తున్నాయి. రైతుల బయోమెట్రిక్ వేయాలన్నా, ఐరిస్ నమోదు చేయాలన్నా సాంకేతికత సహకరించడం లేదు. భూముల సర్వే జరిగిన గ్రామాల్లోని ఎల్పీ నంబర్లకు, పాత సర్వే నంబర్లకు మధ్య తేడాలు ఉండడంతో నమోదు మరింత సంక్లిష్టంగా మారింది. మరో మూడు రోజుల్లో అద్భుతం జరిగి, ఈ ప్రక్రియ పూర్తి కాకపోతే..ఖరీఫ్‌లో చెమటోడ్చి పంట పండించిన రైతన్న కన్నీరు పెట్టుకోక తప్పదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ప్రత్యేక చర్యలు చేపట్టి, ఈ-క్రాప్ నమోదును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నాం



జిల్లావ్యాప్తంగా ఈ-క్రాప్ నమోదు పూర్తిచేయాలని రోజువారీ లక్ష్యాలను సిబ్బందికి ఇచ్చి రోజుకు 50 ఎకరాలు పూర్తి చేయాలని ఆదేశించాం. వెబ్ ల్యాండ్‌లో రైతులకు సంబంధించిన వివరాలు సాంకేతిక సమస్యతో కనిపించని చోట మ్యాన్యువల్‌గా నమోదు చేసేందుకు అనుమతులు అడిగాం. ఎప్పటికప్పుడు తగిన చర్యలతో పంట నమోదు పూర్తి చేసేలా పనిచేస్తున్నాం.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, పార్వతీపురం మన్యం

మత్తు పదార్థాలను పూర్తిగా నివారించాలి

- కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్

విజయనగరం అర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి కోరారు. జిల్లాలో పూర్తిస్థాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. ముందుగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి తీసుకున్న చర్యలను వివరించారు. జిల్లా మీదుగా గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలను తీసుకున్నామని చెప్పారు. ఇప్పటికే వివిధ చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీ ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. మత్తుపదార్థాలను గుర్తించేందుకు రెండు డాగ్ స్క్వాడ్‌లను కూడా వినియోగిస్తున్నామన్నారు. పాత నేరస్తులపైనా దృష్టి సారించి మత్తుపదార్థాల వినియోగాన్ని మానిపించేందుకు జిల్లాలో డీ అడిక్షన్ సెంటర్‌ను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతోనే పూర్తి స్థాయిలో డ్రగ్స్‌ను అరికట్టువచ్చునని ఎస్పీ అభిప్రాయ పడ్డారు. కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ నేరాలను అరికట్టడంలో మన జిల్లా మెరుగైన స్థానంలో ఉందన్నారు. ముఖ్యంగా మహిళలపై దాడులు, దౌర్జన్యాలను అరికట్టడంలో 6వ స్థానంలో నిలిచామని చెప్పారు. జిల్లాలో మత్తు పదార్థాలను, గంజాయిని పూర్తి స్థాయిలో నివారించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వివిధ వర్గాల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా జిల్లాలో డ్రగ్స్ వినియోగం, రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడం సాధ్యపడుతుందని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, డీఎస్‌డబ్ల్యూఓ వెంకటేశ్వరరావు, డీబీసీడబ్ల్యూఓ జ్యోతిశ్రీ వయోజనవిద్య డీడీ సోమేశ్వరరావు, ఆర్‌డీఓలు, డీఎస్పీలు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

- క్లూస్ టీమ్, ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్ టీమ్‌తో ఆధారాల సేకరణ


మృతుడి ఇంటి వద్ద హత్యకు సంబంధించిన ఆధారాలు సేకరిస్తున్న సీఐ రమణ, ఎస్సై మహేష్

బొండపల్లి: మండలంలోని కొండకిండాం గ్రామంలో సంచలనం సృష్టించిన ఆస్తి విషయంలో తండ్రిని హత్య చేసిన కొడుకు ఘటనలో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీఏవీ రమణతో పాటు, స్థానిక ఎస్సై యు.మహేష్‌లు గురువారం రాత్రి నుంచి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. హత్యకు గురైన పెద్దమజ్జి నాయుడుబాబుపై ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్య చేసిన తర్వాత కుమారుడు గణేష్‌కుమార్ పరారీ కావడంతో ప్రత్యక్ష సాక్షులు, కుటుంబసభ్యులు, స్థానికుల నుంచి హత్య వివరాలను పోలీసులు సేకరించారు. నిందితుడు గణేష్ కుమార్ వేపాడలోని మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. తండ్రి ఆరోగ్యం కోసం వైద్య ఖర్చులకుగాను భూమిని అమ్మే క్రమంలో తండ్రీకొడుకుల మధ్య కొద్ది రోజులుగా నడిచిన ఆస్తి వివాదం ఈ హత్యకు దారి తీసినట్లు పోలీసులు గుర్తించి నిర్ధారణకు వచ్చారు. మృతురాలి భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించారు. హత్యచేసేందుకు నిందితుడు ఉపయోగించిన రాడ్డుతో పాటు ప్రాథమిక ఆధారాలను క్లూస్ టీమ్‌తో పాటు, రీజియన్ ఫోరెన్సిక్స్ సైన్స్ లేబొరేటరీ టీమ్‌తో సేకరించినట్లు సీఐ రమణ తెలిపారు. నిందితుడిని తర్వలోనే పట్టుకుని అరెస్టు చేసి రిమాండుకు తరలించనున్నట్లు సీఐ చెప్పారు.

ఆర్‌టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

భామిని: మండలంలోని అత్తికొత్తూరు కూడలి వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు కింది పడి ఒడిశాలోని కొరమ గ్రామానికి చెందిన వృద్ధురాలు కోన మహాలక్ష్మి(70) మృతి చెందింది. భామిని మండలంలోని తాలాడ గ్రామంలో ఉన్న కూతురు వలరౌతు భారతిని చూడడానికి వచ్చి స్వగ్రామం ఒడిశాకు బయల్దేరిన సమయంలో ప్రమాదం జరిగింది. మహాలక్ష్మి బత్తిలి వైపు వెళ్లే ఆటో ఎక్కబోతుండగా కొత్తూరు నుంచి బత్తిలి వైపు వస్తున్న శ్రీకాకుళం పల్లెవెలుగు బస్సు ఢీకొనడంతో మృత్యువాత పడిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతురాలి కూతురు భారతి ఫిర్యాదు మేరకు బత్తిలి హెచ్‌సీ సంగమేస్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

టెన్త్ విద్యార్థిని..


పువ్వల అంజలి (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుకల్లు పంచాయతీ కంబగూడ గ్రామానికి చెందిన పువ్వల అంజలి(15) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం అర్ధరాత్రి (తెల్లవారితే శుక్రవారం)మృతి చెందింది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..కురుపాం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో అంజలి పదోతరగతి చదువుతోంది. దసరా సెలవులు ఇవ్వడానికి ముందు రోజు నుంచే అంజలి అనారోగ్యంతో బాధపడుతుండేది. దసరా సెలవులు ఇవ్వడంతో అంజలిని వచ్చి తీసుకెళ్లాలంటూ పాఠశాల సిబ్బంది ఫోన్ చేయడంతో అంజలి చిన్నాన్న రాజారావు పాఠశాలకు వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న అంజలిని ఇంటికి తీసుకువెళ్లాడు. వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి జ్వరంతో బాధపడుతున్న అంజలిని రాజారావు ఈనెల 21వ తేదీన దుడ్డుకల్లు పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్య సేవలను అందించాడు. అయినప్పటికీ ఆమె మృతి చెందింది. ఈ సమాచారం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది కంబగూడ గ్రామానికి వెళ్లి విద్యార్థిని కుటుంబసభ్యులను శుక్రవారం పరామర్శించారు.

గల్లంతైన యువకుడు..

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లికి చెందిన వర్రి మధు వెంగళరాయ సాగర్ చెరువులో గల్లంతైనట్లు తండ్రి దాడియ్య పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ కేసు దర్యాప్తులో భాగంగా చెరువులో బోట్లు, గజ ఈతగాళ్లతో గాలింపు చేసిన పోలీసులు మృతదేహాన్ని శుక్రవారం కనుగొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై డి.కొండలరావు తెలిపారు.

ఇటుకల తయారీ కార్మికుడి ఆత్మహత్య


దుప్పట్లో రవి మృతదేహాన్ని తోట నుంచి ప్రధాన రహదారికి తీసుకువస్తున్న ఎస్సై, సిబ్బంది

పాలకొండ రూరల్: పెళ్లై పదేళ్లయినా పిల్లలు లేకపోవడంతో కుంగిపోయాడు. తనతోపాటు వివాహాలు చేసుకున్న వారంతా పిల్లాపాపలతో సంతోషంగా గడుపుతుంటే వారిని చూసి నిరాశకు లోనయ్యాడు. అంతా ప్రశ్నిస్తుంటే తీవ్ర మనస్తాపం చెంది చివరకు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ గ్రామంలోని కుమ్మరవీధికి చెందిన బుడుమూరు రవి(37)కి అదే గ్రామానికి చెందిన లక్ష్మితో పది సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహం అనంతరం భార్యాభర్తలు ఇటుకల తయారీ కార్మికులుగా పనులు చేస్తూ జీవనం గడుపుతున్నారు. రెండు నెలల క్రితం భార్య, మరో ఇద్దరు కార్మికులతో కలిసి బతుకుతెరువులో భాగంగా పాలకొండ సమీపంలో ఇటుకల తయారీ పనిలో రవి చేరాడు. తనకు పిల్లలు కలగకపోవడంతో నిత్యం సహచరుల వద్ద ఆవేదన చెందేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఆరోగ్యం బాగా లేదని, వైద్యులకు చూపించుకుంటానని భార్యకు చెప్పి ఇంటి నుంచి వచ్చేశాడు. చీకటి పడినా ఇంటికి చేరక పోవడంతో భార్య లక్ష్మి ఇటుకల బట్టీ నిర్వాహకుడు శ్రీనివాసరావును వాకబు చేసింది. వారు ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం పాలకొండ-వీరఘట్టం ప్రధాన రహదారిలో గజాలకానా సమీపంలో ఓ తోట గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రదేశంలో పురుగు మందు డబ్బా, ఓ గ్లాసు, వాటర్ బాటిల్‌తోపాటు సెల్ ఫోన్‌ను గుర్తించారు. ఫోన్‌లో ఉన్న నంబర్ల ఆధారంగా మృతుని వివరాలు సేకరించి, స్థానికంగా ఉన్న భార్యకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆమె స్థానిక ఏరియా ఆస్పత్రికి చేరుకుని పిల్లలు కలగకపోవడంతో తన భర్త పడ్డ వేదన తలుచుకుంటూ మృతదేహంపై పడి గుండెలు పగిలేలా రోదించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గడ్డి మందు తాగి యువకుడు..


పిన్నింటి సత్య నారాయణ (ఫైల్)

గుర్ల: మండలంలోని దమరసింగికి చెందిన పిన్నింటి సత్యనారాయణ(27) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..పిన్నింటి సత్యనారాయణకు వివాహం చేయాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. పెద్దలు నిర్ణయించిన పెళ్లి ఇష్టం లేకపోవడంతో పాటు కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా ఉండలేక ఈనెల18న సత్యనారాయణ గడ్డి మందు తాగేశాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా వారం రోజుల చికిత్స అనంతరం శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై నారాయణ రావు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

లారీ ఢీకొని 12 మేకల మృతి

భామిని: మండలంలోని పసుకుడి వద్ద శుక్రవారం ఏబీ రోడ్డు దాటుతున్న మేకల మందను లారీ ఢీకొట్టడంతో 12 మేకలు మృత్యువాత పడ్డాయి. తెల్లవారుతుండగా భామిని నుంచి బత్తిలి వెళ్తున్న సిమెంట్ లారీ మితిమీరిన వేగంతో మేకల మందను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఇదే ప్రమాదంలో మేకల యజమాని గంటా వెంకటి కూడా త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ ప్రమాదంలో రోడ్డు వెంబడి మేకల కళేబరాలు పరుచుకున్నాయి. ప్రమాద ఘటన గుర్తించిన గ్రామస్తులు లారీని నిలిపివేసి మేకల పెంపకం దారుకు పరిహారం ఇప్పించడానికి ప్రయత్నాలు చేపట్టారు.

గిరిజన బిడ్డకు అరుదైన గౌరవం

- తెలుగు శాస్త్రవేత్తకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు
- ఖనిజ ఆవిష్కరణ, అన్వేషణలో ప్రతిభకు దక్కిన గుర్తింపు
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న శ్యామ్‌కుమార్


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్యామ్‌కుమార్

మక్కువ/సాలూరు రూరల్: అయనదో గిరిజన తండాలోని మారుమూల గ్రామం. అక్షరాస్యతపై తండాలో అవగాహన అంతంత మాత్రమే. అటువంటి గిరిజన గ్రామంలో జన్మించిన సంగంరెడ్డి శ్యామ్‌కుమార్ ముత్యంలా మెరిసి, ఉన్నతశిఖరాలు అధిరోహించి, దేశ ప్రథమపౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడంతో ఆ గిరిజన తండాలో సంబరాలు మిన్నంటాయి.

తెలుగు శాస్త్రవేత్తకు దక్కిన గౌరవం

భారత భూభౌగోళ పరిశోధన సంస్థలో భూగోళ శాస్త్రవేత్తగా ఉత్తమ సేవలందించిన తెలుగు శాస్త్రవేత్త సంగంరెడ్డి శ్యామ్‌కుమార్ 2024-25సంవత్సరానికిగాను, జాతీయ భూగోళ శాస్త్ర పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శుక్రవారం దేశరాజధాని ఢిల్లీలో అందుకున్నారు. భారత భూగోళ పరిశోధన సంస్థ(జీఎస్ఐ) మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ భూగోళ శాస్త్రవేత్తలుగా సేవలందించే వారికి ప్రతిష్టాత్మక గౌరవంగా అందించే ఈ పురస్కారం శ్యామ్‌కుమార్‌కు లభించింది. ఒడిశా రాష్ట్రంలో శ్యామ్‌కుమార్ చేపట్టిన ఖనిజ అన్వేషణకు దక్కిన గౌరవం ఇది. కాపర్ నికిల్ గోల్డ్ కోబాల్ట్ వంటి కీలక ఖనిజాలను గుర్తించడంతోపాటు, రక్షణ, హరితశక్తి, పరిశ్రమల అభివృద్ధికి అత్యంత అవసరమైన ఖనిజ లభ్యత ద్వారా దేశ ఆర్థికరంగానికి శక్తి ఆధారిత విధానాలకు బలమైన మద్దతు లభించినందున ఈ అవార్డును ప్రదానం చేశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి

సాలూరు మండలం, కరాసువలస పంచాయతీ, కొమ్మువానివలస గ్రామానికి చెందిన సంగంరెడ్డి శ్యామ్‌కుమార్ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జియాలజీలో పీజీ పూర్తిచేశారు. శ్యామ్‌కుమార్‌కు మొదటి నుంచి పరిశోధనపట్ల అపారమైన మక్కువ. భూభౌగోళిక సాంకేతికతలో శ్యామ్‌కుమార్‌కున్న అనుభవం ఈస్థాయికి తీసుకువెళ్లిందని పరిశోధన వర్గ విభాగ తోటి ఉద్యోగులు చెబుతున్నారు.

గిరిజనతండాలో మెరిసిన ఆణిముత్యం

శాస్త్రవేత్త సంగంరెడ్డి శ్యామ్‌కుమార్ తండ్రి సంగంరెడ్డి అప్పన్న, గిరిజనసంక్షేమశాఖ పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు కాగా, తల్లి సోమమ్మ గృహిణి. ఈ గిరిజన దంపతుల మూడవ సంతానం శ్యామ్‌కుమార్. ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ పూర్తిచేసి, 2015లో శాస్త్రవేత్తగా ఉద్యోగంలో చేరారు. తెలుగు శాస్త్రవేత్తకు అరుదైన పురస్కారం లభించడంతో మన్యం జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు

- క్రీడాకారులకు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అభినందనలు

విజయనగరం: కలియుగ భీముడు కోడిరామమూర్తి స్ఫూర్తితో జిల్లాలోని బాడీ బిల్డర్‌లు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఏపీ శాసన సభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. ఈనెల 24న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను కోలగట్ల శుక్రవారం అభినందించి సత్కరించారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏడుగురు క్రీడాకారుల్లో ఐదుగురు పతకాలు సాధించడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. పోటీల్లో వరుణ్ బంగారు పతకంతో స్కూటీని గెలుపొందాడన్నారు. 75 కేజీల విభాగంలో జి.రమేష్ బంగారు పతకం సాధించగా, మెన్స్ ఫిజిక్‌లో పి.వంశీ వెండి పతకం, 55 కేజీల బాడీ బిల్డింగ్ విభాగంలో 4వ స్థానం దక్కించుకున్నట్లు తెలిపారు. 80 కేజీల విభాగంలో ఎస్‌కె.సుభాన్ 3వ స్థానం దక్కించుకోగా..ఫిజికల్లీ ఛాలెంజెండ్ విభాగంలో బి.సాయి బంగారు పతకం కైవసం చేసుకున్నట్లు వివరించారు. ఈనెల 28న విజయనగరం వేదికగా నిర్వహించే మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకల కృష్ణ, కార్యదర్శి బైక్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం నివారణకు చర్యలు

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

సాక్షి ఎఫెక్ట్


ఐసీడీఎస్ పీడీ డా.టి.కనకదుర్గ

పార్వతీపురం: జిల్లాలోని ఐసీడీఎస్ కేంద్రాల్లో రక్తహీనతగల చిన్నారులు, గర్భిణులతో పాటు వయస్సుకు తగిన ఎత్తు, బరువులేని చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం 'తిండి లేదు..కండ కలగదు' శీర్షిక సాక్షి దినపత్రికలో ఈనెల 25న వెలువడిన కథనంపై ఆమె స్పందించారు. గర్భిణులకు పౌష్టికాహారం లోపం నివారణకు ప్రతి మొదటి, మూడవ శుక్రవారాల్లో టీహెచ్‌ఆర్ సరఫరా చేసి, వైద్యులతో పీరియాడికల్ తనిఖీలను నిర్వహించడంతోపాటు ఎనిమియా తగ్గించేందుకు ఐఎఫ్‌ఏ మాత్రలు కూడా అందిస్తున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాలమేరకు పిల్లల వైద్య నిపుణుల ద్వారా నెలలో రెండుసార్లు ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను పరీక్షించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన ఏనుగులు


ఏనుగులు ధ్వంసం చేసిన ప్రాంతంలో పడి ఉన్న మొక్కజొన్న కంకులను చూపిస్తున్న రైతు పారినాయుడు

పార్వతీపురం రూరల్: మండలంలోనికి రెండు రోజుల క్రితం ప్రవేశించిన ఏనుగుల గుంపు పెదమరికి, చినమరికి, బండిదొరవలస తదితర గ్రామాలకు సంబంధించిన రైతుల పంట పొలాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. గురువారం రాత్రి చినమరికి గ్రామానికి చెందిన డొల్లు పారినాయుడు అనే రైతుకు చెందిన రెండెకరాల మొక్కజొన్న పంటలో తిష్ఠవేసి పూర్తిగా శుక్రవారం ఉదయానికి పంటను ధ్వంసం చేశాయి. మరికొద్ది రోజుల్లో పంట చేతికి అందికొచ్చే సమయంలో సరిగ్గా గతేడాదిలాగానే ఏనుగులు ప్రవేశించి పంటలను నాశనం చేయడం పట్ల రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అలాగే రాత్రివేళ రహదారి పక్కనే ఉన్న పంట పొలాల్లో ఏనుగుల గుంపు తిష్ఠ వేయడంతో చీకటి పడితే సమీప గ్రామాలకు వెళ్లేందుకు రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామాల ప్రజలకు దినదిన గండంగా పరిస్థితులు నెలకొన్నాయి.

మూడవ లైన్‌లో స్పీడ్ ట్రయల్ రన్


ట్రయల్ రన్‌లో పాల్గొన్న రైల్వే అధికారులు

పార్వతీపురం టౌన్/బొబ్బిలి: పార్వతీపురం-డొంకినవలస మధ్య కొత్తగా వేసిన రైల్వే మూడవ లైన్‌లో స్పీడ్ ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయిందని రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ట్రయల్ రన్, అమృత భారత్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది వాల్తేరు డివిజన్‌కు మరో మైలురాయిగా, ఈ ప్రాంతంలో రైలు మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుందన్నారు. డొంకినవలస, బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం స్టేషన్లను కలిపేందుకు 36 కిలోమీటర్లలో కొత్తగా నిర్మించిన, విద్యుదీకరించిన మూడవ లైన్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత స్పీడ్ ట్రయల్ రన్‌ను పర్యవేక్షించినట్లు తెలిపారు. రాయగడ-విజయనగరం మార్గం డబ్లింగ్‌లో భాగంగా ఉందన్నారు. డివిజన్‌లోని నిర్మాణం, ఇతర శాఖల మధ్య ప్రమేయం ఉన్న అన్ని విభాగాల అంకితభావాన్ని, సమర్థవంతమైన సమన్వయాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. అనంతరం అధికారులు స్టేషన్ షేర్డ్ క్రాస్ ఓవర్లు, హైలెవల్ ప్లాట్‌ఫామ్‌లు, వంతెనలతో పాటు కొత్తగా అందించిన సౌకర్యాలపై సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కన్‌స్ట్రక్షన్) అంకుష్ గుప్తా, చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.కె.పాత్రో, వాల్తేరు డివిజన్ నుంచి సివిల్ ఇంజినీరింగ్, సిగ్నల్- టెలికాం, ఎలక్ట్రికల్, ట్రాఫిక్ విభాగాల నుంచి ముఖ్య అధికారులు పాల్గొన్నారు.